

జాలువారుతున్న జలపాతాలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. పర్యాటకులు అధిక సంఖ్యలో ఆయా జలపాతాలను సందర్శిస్తున్నారు. - 8లో▸



బదిలీలా.. పదోన్నతులా?

బదిలీలు, పదోన్నతులపై విద్యుత్ ఉద్యోగుల్లో గందరగోళం నెలకొంది. కొందరు ఉద్యోగులు బదిలీల కోసం, మరికొందరు పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30^0 / 25^0

వాతావరణం

జిల్లాలో రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంతర్జాతీయ సదస్సుకు వెంకట్



కేయూ క్యాంపస్: 'ట్రైబల్ లైవ్లీవుడ్ ప్యాటర్న్స్ ఇష్యూస్ అండ్ స్ట్రాటజీస్ ఫర్ ఎంపవర్‌మెంట్' అంశంపై హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు కేయూ పొలిటికల్ సైన్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంకినేని వెంకట్ హాజరుకానున్నారు. ఈ సదస్సులో 'డెమొక్రటైజేషన్ ఇన్ ట్రైబల్ ఏరియాస్ అండ్ చాలెంజెస్' అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నట్లు వెంకట్ తెలిపారు.

ఉద్యోగార్థులకు ఉచిత స్టడీ రూం



నయీంనగర్: జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, రాష్ట్ర అవార్డు గ్రహీత వెలుదండి సుమలత.. ఉద్యోగార్థుల కోసం బుధవారం ఉచిత స్టడీ రూంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు హనుమకొండలో మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ప్రకటనతో గ్రంథాలయాలు కిటకిటలాడుతున్నాయని తెలిపారు. దీంతో హనుమకొండ 53వ డివిజన్ ఆదర్శ కాలనీలోని అభి నిలయంలో ఆలయ ఫౌండేషన్ సౌజన్యంతో పుస్తకాలు, కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు, మంచి నీటి వసతితో ఉచిత స్టడీ రూం అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. పేద ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9490133650 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సినారె పురస్కారానికి బిల్ల మహేందర్ ఎంపిక



హన్మకొండ కల్చరల్: సినారె సాహిత్య రాష్ట్రస్థాయి పురస్కారానికి హనుమకొండకు చెందిన ప్రముఖ కవి, రచయిత, ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని మహాకవి సినారె కళాపీఠం వారు ప్రతి సంవత్సరం సినారె జయంతి సందర్భంగా సాహిత్య పురస్కారాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన మహేందర్‌ను ఈ పురస్కారానికి ఎంపికచేశారు. ఈ నెల 10వతేదీన హైదరాబాద్‌లోని కళాపీఠం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కవులు, రచయితలు, ఉపాధ్యాయులు మహేందర్‌కు అభినందనలు తెలిపారు.

9 వరకు దరఖాస్తుల స్వీకరణ

హన్మకొండ కల్చరల్ : ఓరుగల్లు ప్రాంగణంలోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2024–25 విద్యాసంవత్సరానికి ఈ నెల 9వరకు రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్యా బాబురావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశాలు పొందొచ్చని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. సాధారణ రుసుముతో ఆగస్టు 9వతేదీ వరకు, ఆలస్య రుసుముతో ఆగస్టు 19వ తేదీ వరకు తెలుగు యూనివర్సిటీ వెబ్‌సైట్ WWW.teufuuniv-errity.ac.in, www.prtucet.orfలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అవినీతిపై ఎన్పీడీసీఎల్ ఉక్కుపాదం

- లంచం ఇవ్వొద్దని ప్రతీ కార్యాలయంలో పోస్టర్ ఏర్పాటు



హన్మకొండ: తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో అవినీతిపై యాజమాన్యం ఉక్కుపాదం మోపుతోంది. అధికారులు, ఉద్యోగులు అవినీతికి పాల్పడవద్దని, వీరికి వినియోగదారులు లంచం ఇవ్వొద్దని మేల్కొలుపుతూ ప్రతీ కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టర్ ఏర్పాటు చేస్తున్నారు. 'లంచం ఇవ్వకండి... మాకు సమాచారం ఇవ్వండి. అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం.. లంచం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరం అని, 92810 33233 లేదా 1064 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని యాజమాన్యం సూచించింది.

మోస్తరు వర్షం..

వరంగల్‌నగరంలో బుధవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమై ఉండగా ఒక్కసారిగా వర్షం రావడంతో జనం ఉరుకులు, పరుగులు పెట్టారు. లోతట్టు రోడ్లపై వరద పారింది. రోడ్లపై ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు అవస్థలు పద్దారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ




హనుమకొండ కలెక్టరేట్ సమీపంలో వర్షంలోనే వెళ్తున్న వాహనదారులు, హనుమకొండ అంబేడ్కర్ భవన్ ముందు రోడ్డుపైనుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు

కేయూ పీజీ పరీక్షల్లో ముగ్గురి డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్.సౌజన్యజీ ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును ఆమె పరిశీలించారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తుండగా ముగ్గురు విద్యార్థులను డీబార్ చేసినట్లు ఆమె తెలిపారు.

రాత్రివేళ రారు!



ఇళ్ల నుంచి బెడ్‌షీట్లు తెచ్చుకుని అత్యవసర వార్డులో చికిత్స పొందుతున్న రోగులు



ఎంజీఎం ఆస్పత్రిలో విధులకు వైద్యుల డుమ్మా

- ఒకవేళ హాజరైనా గదుల్లో నిద్రకే పరిమితం
- జూనియర్ డాక్టర్ల చికిత్సతో ప్రాణాపాయ స్థితిలో క్షతగాత్రుడు
- క్యాజువాలిటీకి రానంటూ డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం
- అత్యవసర విభాగం అస్తవ్యస్తం.. పడకలపై బెడ్‌షీట్లు కూడా కరువే

ఎంజీఎం:

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రాత్రివేళ రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదు. విధులకు వైద్యులు గైర్హాజరు కావడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ రామన్నపేటకు చెందిన శివ అనే యువకుడు బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్నేహితులు శివను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. అత్యవసర విభాగంలో డీఎంఓ, ఆర్థోపెడిక్, సర్జికల్ సీనియర్ డాక్టర్లు అందుబాటులో లేరు. డ్యూటీ డాక్టర్‌కు సిబ్బంది ఫోన్ చేస్తే తాను క్యాజువాలిటీకి రానంటూ ఆమె సమాధానం ఇవ్వడం గమనార్హం. వైద్యసిబ్బంది రక్తస్రావం కాకుండా చికిత్స అందించి ఎక్స్‌రే తీశారు. ఎక్స్‌రే పరీక్షించిన జూనియర్ వైద్యులు అంతా సాధారణంగానే ఉంది ఇంటికి తీసుకెళ్లమన్నారు. ఉదయం 3 గంటల ప్రాంతంలో ఇంటికి తీసుకెళ్లగా.. 5 గంటలకు శివ రక్తంతో కూడిన వాంతులు చేసుకున్నాడు. దీంతో ఎంజీఎం ఆస్పత్రి వైద్యసేవలపై నమ్మకం లేక కుటుంబ సభ్యులు ఆయనను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ సీటీ స్కాన్ చేసిన వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టింది ఆస్పత్రిలో అడ్మిట్ చేసి చికిత్స చేయాలని చెప్పారు. ఇలా ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యులు విధులకు డుమ్మా కొడుతూ.. జూనియర్ వైద్యులతో చికిత్స చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించి అధికారులను మందలించినా వైద్య సేవలు మెరుగుపడడం లేదని రోగులు ఆందోళన చెందుతున్నారు.



ఎంజీఎం ఆస్పత్రిలోని అత్యవసర చికిత్స విభాగం

అధ్వానంగా అత్యవసర చికిత్స విభాగం

ఎంజీఎం ఆస్పత్రిలో అత్యవసర చికిత్స విభాగం పడకలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. బెడ్‌షీట్లు, మెత్తలు సమకూర్చకపోవడంతో రోగులు ఇంటి వద్ద నుంచి తెచ్చుకొని వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అంతే కాకుండా అత్యవసర విభాగం గదులు సైతం అపరిశుభ్రంగా కనిపించడం ఆస్పత్రి పాలనకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

సంతకాలు చేస్తూ.. గదుల్లో నిద్రిస్తూ..

ఎంజీఎం ఆస్పత్రిలోని క్యాజువాలిటీ ప్రతిరోజు రాత్రి వేళ రద్దీగా ఉంటుంది. పెద్దఎత్తున రోడ్డు ప్రమాద క్షతగాత్రులు వచ్చి చికిత్స పొందుతుంటారు. ఈ సమయంలో ఒకవేళ వైద్యులు వస్తే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెడుతూ, బయోమెట్రిక్‌లో వేలిముద్రలు వేస్తూ అత్యవసర విభాగంలో విధులు నిర్వర్తించడం లేదు. తమ గదుల్లో నిద్రిస్తూ హౌస్‌సర్జన్లతో చికిత్సలు చేయిస్తున్నారు.

ఘటనపై విచారణ చేస్తాం

క్షతగాత్రుడికి వైద్యం అందించిన తీరుపై వివరాలు తెలుసుకుంటాం. రాత్రి వేళ ఎవరెవరు వైద్యులు విధుల్లో ఉన్నారో పరిశీలిస్తాం. పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటా. అత్యవసర విభాగాల్లో పడకలు, బెడ్‌షీట్ల కొరత లేకుండా ఇన్‌చార్జ్ నర్సులతో మాట్లాడి సేవలు మెరుగుపరుస్తాం.

- మురళి, ఎంజీఎం సూపరింటెండెంట్

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

- వరంగల్ కలెక్టర్ సత్య శారద



సీకేఎం ఆస్పత్రిలో బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్ చౌరస్తా/ఎంజీఎం: తల్లిపాలే బిడ్డకు సురక్షితమని, శిశువుకు ముర్రుపాలు పట్టడం ద్వారా తల్లి సైతం ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా వరంగల్ పోస్టాఫీస్ నుంచి సీకేఎం ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రసూతి ఆస్పత్రిలో జిల్లా సంక్షేమ శాఖ, జాతీయ ఆయుష్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీకేఎం ఆస్పత్రి డెలివరీ వార్డులోని బాలింతలతో కలెక్టర్ కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి హైమావతి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ప్రాజెక్టు సీడీపీఓ విద్య, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలను ప్రోత్సహించాలి

కాళోజీ సెంటర్: జాతీయ చేనేత దినోత్సవం స్ఫూర్తితో నేతన్నలను ప్రోత్సహించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ కాళోజీ సెంటర్ నుంచి జెడ్పీ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల స్టాళ్లను సందర్శించి, కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా చేనేత వస్త్ర ఉపయోగంపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, రాఘవరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బంది కలిగించొద్దు

వైద్యసేవల విషయంలో రోగులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని కలెక్టర్ సత్యశారద హెచ్చరించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఎంజీఎం, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి, నర్సంపేట నూతన ప్రభుత్వ ఆస్పత్రి వైద్య కళాశాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ విధులు నిర్వర్తించడంతో డాక్టర్ల బాధ్యత పూర్తయినట్లు కాదన్నారు. నర్సింగ్ స్టూడెంట్స్ హాస్టల్ షిఫ్టింగ్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపినందున వరంగల్‌లోని రామ్ కీ ఎన్‌క్లేవ్‌లోని భవనంలోకి విద్యార్థులను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. సమావేశంలో ప్రాంతీయ కంటి ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు భరత్ కుమార్, గోపాల్, కిషన్, డీఆర్డీఓ కౌసల్యా దేవి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఆర్డీఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్, పక్కన కలెక్టర్ సత్యశారద తదితరులు

కాళోజీ సెంటర్: ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ సత్యశారద, ఫుడ్ కమిషన్ సభ్యులతో కలిసి ఆహార భద్రత అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పేదలు, విద్యార్థులు, గర్భిణులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఆహార భద్రత అందించాలని శ్రీనివాస్ తెలిపారు. అంగన్‌వాడీ వ్యవస్థ మరింత మెరుగుపడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతతో అందేలా చూడాలని చూడాలన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ రాష్ట్ర కమిషన్ జిల్లాలో క్షేత్రస్థాయి తనిఖీలో గుర్తించిన లోటుపాట్లను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే సరిచేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, మాకుంట్ల భారతి, రంగినేని శారద, బి.జ్యోతి, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ పీడీ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఎస్ఓ శివప్రసాద్‌రెడ్డి, డీఈఓ వాసంతి, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

చేనేత రంగానికి ప్రోత్సాహం

- జాతీయ చేనేత దినోత్సవంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



జాతీయ చేనేత దినోత్సవంలో మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ: చేనేత రంగం, చేనేత కార్మికులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. హనుమకొండలోని జెడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ మాట్లాడారు. చేనేత వస్త్రాలను ఆదరించాలని, భావితరాలకు అందించాలని సూచించారు. చేనేతవస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా కార్మికులను ఆర్థికంగా ప్రోత్సహించిన వారమవుతామని, ఇది మన బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో ఉన్న చేనేత కార్మికులు,చేనేత వస్త్రాలను ప్రోత్సహించడానికి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి సహాయ, సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 70 మంది చేనేత కార్మికులు, చేనేతపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలైన ముగ్గురు విద్యార్థినులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. వేడుకల్లో హ్యాండ్లూం అండ్ టెక్స్‌టైల్ హనుమకొండ, వరంగల్ జిల్లా సహాయ సంచాలకులు విజయలక్ష్మి, రాఘవరావు అధికారులు పాల్గొన్నారు.

20లోపు కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తిచేయండి

నయీంనగర్: కాళోజీ కళాక్షేత్రం పనులు ఈనెల 20లోపు పూర్తిచేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం కళాక్షేత్రం నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. అదనంగా కార్మికులను నియమించి పనులు పూర్తిచేయాలని, పనులపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్, కుడా వీసీ అశ్విని తానాజీ వాకడే, కుడా ఈఈ భీంరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ చేనేత కార్మికులకు అవార్డుల ప్రదానం



మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న వరంగల్ చేనేత కార్మికులు

వరంగల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌కు చెందిన ఇద్దరు చేనేత కార్మికులకు ప్రభుత్వం బుధవారం అవార్డులు ప్రదానం చేసింది. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో బుధవారం చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా దర్రీస్ చేనేత కార్మికులు ఆడెపు శ్రీనివాస్, సామల సదానందం రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న కార్మికులను టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడురు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంపై వివిధ దేశాలకు వరంగల్ కార్పెట్లను ఆర్డర్లు ఇప్పిస్తున్న చిప్ప కిరణ్‌కుమార్ నూలు దండలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, చేనేతశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, ఆర్‌డీడీ పి.వెంకటేశం, డీడీ ఇందుమతి పాల్గొన్నారు.

ఆస్తిపన్ను పెంపుపై సమీక్షించండి

చిన్న గ్రామ పంచాయతీలతో స్థానిక సంస్థలకు ఇబ్బందులు

- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- మూడంచెల విధానం మేలు : ఎమ్మెల్యే సత్యనారాయణరావు
- స్థానిక సంస్థల పనితీరుపై ఎస్ఎఫ్‌సీ ఉమ్మడి వరంగల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్‌సీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పక్కన కమిషన్ సభ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, కమిషన్ సభ్యులు నెహ్రూనాయక్, సుధీర్‌కుమార్, అధికారులు

హన్మకొండ అర్బన్: స్థానిక సంస్థల పరిధిలో ఆస్తిపన్ను పెంపు సమీక్షించాలని రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. అతి చిన్న గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాల ఏర్పాటు వల్ల స్థానిక సంస్థల్లో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కొన్నిచోట్ల పైసా ఆదాయం లేని జీపీలు ఉన్నాయని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల అధికారులతో పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థలకు కావాల్సిన నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఇవేకాకుండా స్వయంగా సమకూర్చుకునే పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ఐదంచెల విధానం తీసేసి మూడంచెల విధానం తీసుకురావాలని సూచించారు. జీపీలకు నిధులు కేటాయింపు, సిబ్బంది వేతనాలు, వాహనాల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులు పలు సూచనలు చేశారు. హనుమకొండ డీపీఓ లక్ష్మీరమాకాంత్ మాట్లాడుతూ చిన్న గ్రామ పంచాయతీల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. కరెంటు బిల్లు, ఈఎంఐలు, ఇతరత్రా వాటికి నిధులు విడుదల చేయాలని కోరారు. కమిషన్ సభ్య కార్యదర్శి స్మితాసబర్వాల్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు వచ్చిన నిధుల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు, మహిళా సంక్షేమానికి నిబంధనలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కేఆర్ నాగరాజు, సభ్యులు నెహ్రూనాయక్, సుధీర్ కుమార్, రమేశ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, లెనిన్ వత్సల్ టొప్పో, పింకేశ్‌కుమార్, శ్రీజ, ఆయా జిల్లాల డీపీఓలు, జెడ్పీ సీఈఓలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

'వర్క్ అడ్జెస్ట్‌మెంట్'కు విముఖత

ప్రస్తుతానికి ఐదు మండలాల్లో నిలిపివేత

- వెళ్లేందుకు ససేమిరా అంటున్న కొందరు ఉపాధ్యాయులు
- పని సర్దుబాటు సరిగా జరగలేదనే ఆరోపణలు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ఐదు (హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి) మండలాల్లో టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ (పని సర్దుబాటు)ను నిలిపివేశారు. కొందరు తాము పనిచేస్తున్న పాఠశాలనుంచి వేరే పాఠశాలకు వెళ్లబోమని చెప్పడం, సర్దుబాటు సరిగా జరగలేదనే ఆరోపణలు రావడంతో నిలిపివేశారు. ఏ మండలంలోని టీచర్లను అదే మండలంలోని పాఠశాలలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాల్సి ఉంది. కానీ, పక్క మండలంలోని పాఠశాలలకు చేయడంతో విషయాన్ని పలువురు ఉపాధ్యాయులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ ఐదు మండలాలకు నిర్వహించిన వర్క్‌అడ్జెస్ట్‌మెంట్‌ను నిలిపివేస్తూ ఆయా టీచర్లకు ఎంఈఓలు బుధవారం సమాచారం ఇచ్చారు. దీంతో ఆయా టీచర్లు కూడా పాఠశాలల నుంచి రిలీవ్ కాలేదు. బదిలీలు, పదోన్నతులు ముగిశాక కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీంతో 140 మంది వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు ఉత్తర్వులు ఇచ్చారు.

నిలిపివేసిన ఐదు మండలాల్లో ఇలా..

హనుమకొండ 21, కాజీపేట 17, హసన్‌పర్తి 24, కమలాపూర్ 20, ఎల్కతుర్తి 11మంది టీచర్లను పాఠశాలల్లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద కేటాయించారు. వీరి వర్క్‌అడ్జెస్ట్‌మెంట్‌ను పలు కారణాలతో నిలిపివేసినట్లు ఎంఈఓ రాంకిషన్‌రాజు బుధవారం తెలిపారు. జాబితాను సవరించి మూడు రోజుల తరువాత వెల్లడిస్తామని, అంతేకాకుండా ఉపాధ్యాయసంఘాల బాధ్యులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించి వారి సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, పరకాల, భీమదేవరపల్లి, దామెర, వేలేరు, నడికూడ, శాయంపేట, ఐనవోలు, ఆత్మకూరు, ధర్మసాగర్ మండలాలకు చేసిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రకారం.. వెంటనే ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరాలని సంబంధిత మండలాల విద్యాశాఖాధికారులు ఆదేశించారు.

క్లుప్తంగా

కాళేశ్వరాలయంలో నైమిశారణ్యం పీఠాధిపతి పూజలు


మంగపేట: పీఠాధిపతికి వేదాశీర్వచనం ఇస్తున్న పూజారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని నైమిశారణ్యం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి బుధవారం దర్శించుకున్నారు. దేవస్థాన రాజగోపురం వద్ద అర్చకులు, వేద పండితులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో విశేష పూజలు చేశారు. శ్రీశుభానందాదేవి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. శుభానందాదేవి(పార్వతి) అమ్మవారి ఆలయంలో పీఠాధిపతికి ఆలయ ఈఓ మారుతి, అర్చక స్వాములు, వేదపండితులు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పీఠాధిపతి.. భక్తులకు ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడి సన్నిధిలో ..

మంగపేట : మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామిని నైమిశారణ్యం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కై కర్యం రాఘవాచార్యులు.. బాల బ్రహ్మానంద సరస్వతి పేరిట అర్చన జరిపించి స్వామివారి శేష వస్త్రాలు బహూకరించారు. వేదాశీర్వచనం ఇచ్చి స్వామవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బోదకాలు నిర్మూలనపై డబ్ల్యూహెచ్ఓ ఆరా


వివరాలు తెలుసుకుంటున్న డబ్ల్యూహెచ్ఓ బృందం

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో బోదకాలు నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రతినిధి బృందం బుధవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు కొత్తగూడ, గంగారం, కోమట్లగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఏయే గ్రామాల్లో బోదకాలు కేసులు గుర్తించారు.. వారికి ఎలాంటి చికిత్స అందించారు.. మిగతా వారికి వ్యాపించకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారని ఆరా తీశారు. అనంతరం బోదకాలు బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి మందులు అందుతున్నాయని తెలుసుకున్నారు. ఇకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి సుధీర్‌రెడ్డి, పీఓ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలా.. పదోన్నతులా?




ప్రక్రియ రంగం సిద్ధం చేసిన టీజీ ఎన్పీడీసీఎల్

- పదోన్నతులు కల్పిస్తేనే ఖాళీలపై స్పష్టత
- జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్న విధంగా నోటిఫికేషన్‌కు మార్గం సుగమం
- పదోన్నతులు కల్పించాలని యూనియన్ల డిమాండ్

హన్మకొండ : బదిలీలు, పదోన్నతులపై విద్యుత్ ఉద్యోగుల్లో గందరగోళం నెలకొంది. దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులు బదిలీల కోసం ఎదురు చూస్తుండగా.. సీనియారిటీలో ఉన్న ఉద్యోగులు తమకు ఎప్పుడు పదోన్నతి కల్పిస్తారో అని ఎదురు చూస్తున్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతులు కల్పించడంలో ఆలస్యమైన కొద్దీ ఆశావహులు రిటైర్డ్ అవుతున్నారు. 20 ఏళ్లుగా ఒకే పోస్టులో విధులు నిర్వర్తించి తమకు పదోన్నతి లభిస్తుందని ఎదురుచూసిన ఉద్యోగులకు చివరికి ఉద్యోగ విరమణ తప్పడం లేదు. ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగంలో 20 ఏళ్లుగా ఏడీలుగా పని చేసిన అధికారులు డీఈ పదోన్నతి కోసం, డీఈలుగా పని చేసి ఎస్ఈగా పదోన్నతి కోసం, అదే విధంగా అకౌంట్స్ విభాగంలోనూ నాలుగేళ్లుగా పదోన్నతి కోసం ఎదురుచూసి చివరకు జూలైతో రిటైర్డ్ అయి మానసిక క్షోభకు గురైన వారున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో బదిలీలకు అవకాశం కల్పించింది. జూలై 31 వరకు బదిలీలకు అవకాశం కల్పించింది. అయినా వివిధ కారణాలతో విద్యుత్ సంస్థల్లో బదిలీల ప్రక్రియ మొదలు కాలేదు. ప్రస్తుతం విద్యుత్ సంస్థల యాజమాన్యాలు బదిలీలకు మార్గదర్శకాలు సిద్ధం చేశాయి. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్‌లోనూ బదిలీలకు మార్గదర్శకాలు సిద్ధమయ్యాయి. నేడో రేపో మార్గదర్శకాలు విడుదలవుతాయని ఆశావహులు ఎదురుచూశారు.

ముందు పదోన్నతులపై తేల్చాలి..

పదోన్నతుల చిక్కుముడి వీడకుండా బదిలీలు చేపడితే సమన్యాయం జరగదని విద్యుత్ ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు నిర్ణయానికి వచ్చాయి. పదోన్నతులు దక్కాల్సిన వారు రిటైర్డ్ అవుతుండడంతో అధికారులు, ఉద్యోగ వర్గాల్లో ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ముందు పదోన్నతులపై తాడో పేడో తేల్చుకోవాలని యూనియన్లు, అసోసియేషన్లు ముందుకువచ్చాయి. దీంతో విద్యుత్ సంస్థలు టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కో, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీలకు నోటీసులు అందించాయి. పదోన్నతులు కల్పించాకే బదిలీలు చేపట్టాలని నోటీసులో పేర్కొన్నాయి. పదోన్నతులు చేపట్టకపోతే ఆందోళనలు చేపడుతామని, అవసరమైతే మెరుపు సమ్మెకు దిగడానికి వెనుకాడబోమని హెచ్చరించాయి. దీంతో బదిలీలు చేపట్టాలని నిర్ణయానికి వచ్చి మార్గదర్శకాలు రూపొందించుకున్న విద్యుత్ సంస్థల యాజమాన్యాలు సందిగ్ధంలో పడ్డాయి. ఫలితంగా బదిలీల ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశముందని విద్యుత్ ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

వివాదాస్పదంగా పదోన్నతుల ప్రక్రియ

పదోన్నతుల ప్రక్రియ ఏ విధంగా చేపట్టాలనే అంశం వివాదాస్పదంగా మారింది. మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, రిజర్వేషన్ కమ్ రోస్టర్ విధానంలో పదోన్నతులు చేపట్టాలని ఉద్యోగ వర్గాలు వేర్వేరుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై ఆయా వర్గాలు కోర్టులను ఆశ్రయించాయి. పదోన్నతుల్లో మెరిట్ ఆధారంగా చేపట్టాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని ఓసీ, బీసీ ఉద్యోగ వర్గాలు చెప్పుతుండగా.. గతంలో మాదిరి రిజర్వేషన్ రోస్టర్ పద్ధతిలో పదోన్నతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశం కోర్టులో పరిధిలో ఉండడంతో యూనియన్లు, అసోసియేషన్లు కోర్టు, ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తదుపరి నిర్ణయం ఉంటుందని కండీషన్ పెట్టి పదోన్నతులు కల్పించాలని కోరుతున్నాయి. తద్వారా పదోన్నతుల సమస్యకు చెక్ పడుతుందని అధికార, ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి. బదిలీలకు మార్గం సుగమం అవుతుందని విద్యుత్ ఉద్యోగులు తెలిపారు.

జాబ్ క్యాలెండర్ విడుదల

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. ఇందులో భాగంగా విద్యుత్ సంస్థల్లో ఖాళీలకు అక్టోబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పింది. ఈ క్రమంలో పదోన్నతులు కల్పించకుంటే కింది స్థాయి ఉద్యోగ ఖాళీలపై ఎలా స్పష్టత వస్తుందని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. పదోన్నతులు కల్పిస్తేనే అక్టోబర్‌లో విడుదల చేసే ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌లో ఖాళీలపై స్పష్టత వస్తుందని పేర్కొంటున్నాయి. దీంతో పదోన్నతులు, బదిలీలపై చిక్కుముడి నెలకొంది. పదోన్నతులు కల్పించకుంటే ఆందోళనకు దిగుతామని యూనియన్లు, అసోసియేషన్లు హెచ్చరించిన క్రమంలో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో వేచి చూడాల్సి ఉంది. దీంతో బదిలీల ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది.

జాలువారుతున్న జలపాతాలు..


వాజేడు: బొగత జలపాతం

- బొగత, పాండవుల, బొల్లి జలపాతాలు పరవళ్లు
- పర్యాటకుల సందడి

రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతం, మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం, చింతోనిగుంపు సమీపంలోని బొల్లి జలపాతాలు జాలువారుతున్నాయి. దీంతో బుధవారం పర్యాటకులు అధికసంఖ్యలో ఆయా జలపాతాలను సందర్శించారు. జాలువారుతున్న నీటిని చూసి ఎంజాయ్ చేశారు.

వాజేడు/బయ్యారం


బయ్యారం పెద్దగుట్ట పై నుంచి జాలువారుతున్న జలపాతం

మత్తడి పోస్తున్న లక్నవరం..



గోవిందరావుపేట: రైతుల కల్పతరువు.. ప్రకృతి అందాలకు నిలయం లక్నవరం. ఈ సరస్సు ప్రస్తుతం నిండుకుండలా మారి మత్తడి పోస్తోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సరస్సులోకి 34 ఫీట్ల మేరకు వరద వచ్చి చేరడంతో అలుగు పోస్తోంది. దీంతో లక్నవరం అందాలు తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.


మత్తడి పోస్తున్న లక్నవరం సరస్సు

నేడు కేయూ పాలకమండలి సమావేశం!

- వీసీ నియామకానికి యూనివర్సిటీ ఈసీ నామిని ప్రతిపాదన
- ఎజెండాలో బోధన, బోధనేతర సమస్యలు..?

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సమావేశం ఈనెల 8న (నేడు) సాయంత్రం 4గంటలకు హైదరాబాద్‌లోని రూసాభవనంలో నిర్వహించనున్నారని సమాచారం. పాలకమండలి సభ్యుల నియామకం తరువాత పూర్తిస్థాయి తొలి సమావేశం జరగబోతోంది. ఇందులో కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఇతర పాలకమండలి సభ్యులు పాల్గొనబోతున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా కేయూ వీసీ నియామకానికి సంబంధించి సెర్చ్ కమిటీకి సభ్యుడిగా ఒకరిని కేయూ పాలకమండలి తరఫున ఖరారు చేసి ప్రతిపాదించబోతున్నారని తెలిసింది. వీసీ నియామకానికి ప్రభుత్వం నియమించే సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. యూజీసీ నామిని, యూనివర్సిటీ ఈసీ నామిని, ప్రభుత్వ నామిని ఉంటారు. అందుకే ఈ పాలకమండలి సమావేశమై యూనివర్సిటీ ఈసీ నామినిని ప్రతిపాదించబోతుంది. ఎజెండాలో

బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యలు?

కేయూలో 2013 నియమితులైన బోధనేతర ఉద్యోగుల పీఆర్‌సీ 2020కి సంబంధించి వర్తింపజేసే విషయంలో పాలకమండలిలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం. టైంస్కేల్ ఉద్యోగులకు సంబంధించి క్యాష్ కాంపేన్సేషన్ రూ. 5లక్షల నుంచి రూ. 7లక్షల 50వేలవరకు పెంపుదలకు పాలకమండలి ఆమోదానికి ఎజెండాలో చేర్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు పదోన్నతుల కల్పించాలని కూడా పలుమార్లు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పాలకమండలిలో చర్చిస్తారాలేదా అనేది ఆసక్తికరంగామారింది.

అయిలయ్య డిమోషన్‌ను తొలగించేనా?

కేయూ సోషియాలజీ విభాగం ఆచార్యుడు కుంట అయిలయ్యను సంవత్సరం క్రితం క్రమశిక్షణ చర్యలలో భాగంగా ప్రొఫెసర్ స్థాయినుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌గా డిమోషన్ చేశారు. ఈ విషయంలో కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) బాధ్యులు ఇటీవల రిజిస్ట్రార్‌ను కలిసి అయిలయ్యను ప్రొఫెసర్‌గా యథావిధిగా కొనసాగించాలని కోరారు. అదేవిధంగా అకుట్ జనరల్ సెక్రటరీ అసోసియేట్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారికి ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించలేదు. దీనిపై పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఇస్తారి ఇటీవల రిజిస్ట్రార్‌ను కోరినట్లు సమాచారం. దీనిని కూడా పాలకమండలి ఏజెండాలో పెడుతారాలేదా అనే అంశం చూడాలి.

సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఆనంద్

- ప్రకటించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
- తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచే ఒక్కరే ఎంపిక


ఆనంద్

చెన్నారావుపేట : సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా అంగోతు ఆనంద్ ఎంపికయ్యారు. జూలై 5వ తేదీ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఫలితాలు వెలువడగా.. మంగళవారం సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పోస్టుకు తనను ఎంపిక చేసి ప్రకటించినట్లు ఆనంద్ బుధవారం తెలిపారు. దీంతో ఆనంద్‌ను కుటుంబసభ్యులతోపాటు గ్రామస్తులు అభినందించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోజేర్వు శివారు జగ్గు తండాకు చెందిన అంగోతు భద్రయ్య, అరుణ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సంతోష్ జాతీయ ఖనిజ అభివృద్ధి సంస్థలో మైనింగ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న కుమారుడు ఆనంద్ ప్రస్తుతంసెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. భద్రయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అరుణ ఎంజీఎంలో మెడ్‌కో సోషల్ వర్కర్ (ఎంఎస్‌డబ్ల్యూ)గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఆనంద్ ఒక్కరే సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపిక కావడం విశేషం. ఎస్టీ రిజర్వేషన్ కేటగిరీలో ఆనంద్ మొదటి ర్యాంకు సాధించారు. కాగా, చెన్నైలో పెట్రోలియం కార్పొరేషన్‌లో ఉద్యోగం చేస్తూ ఖాళీ సమయంలో ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్షలకు సన్నద్ధమైనట్లు ఆనంద్ తెలిపారు.

బాల రక్షాభవన్ వివాదాలపై విచారణ

- విచారణ అధికారిగా జెడ్పీ సీఈఓను నియమించిన కలెక్టర్

కాశోజీ సెంటర్: శిశు, స్త్రీ సంక్షేమశాఖ పరిధిలో పనిచేస్తున్న వరంగల్ జిల్లా బాల రక్షాభవన్ సిబ్బంది సమస్యల వలయంలో చిక్కుకున్నారు. గతంలో పనిచేసిన బాల రక్షా భవన్ డీసీపీఓ మహేందర్‌రెడ్డి ఓ మహిళా ఉద్యోగిని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి ఉద్యోగం నుంచి తొలగించిన ఘటన మరవక ముందే మళ్లీ అదే తరహా ఫిర్యాదు ఇన్‌చార్జ్ డీసీపీఓపై రావడం గమనార్హం. నెల క్రితం చైల్డ్‌లైన్ విభాగంలోని ఆరుగురు ఉద్యోగులు డీడబ్ల్యూఓకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో సదరు ఉద్యోగులతో డీడబ్ల్యూఓ సమావేశం ఏర్పాటు చేసి విషయం తెలుకుంటానని చెప్పి షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది. దీంతో సంతృప్తి చెందని సదరు ఉద్యోగులు కలెక్టర్ సత్యాశారదకు ఫిర్యాదు చేయడంతో జెడ్పీ సీఈఓ రాంరెడ్డిని విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విచారణ చేపట్టి నెల రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశించడంతో ఈనెల 3న రాంరెడ్డి డీడబ్ల్యూఓతో కలిసి బాల రక్షా భవన్‌లో విచారించినట్లు తెలిసింది. సిబ్బంది నుంచి లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం.

వివాదాలకు తెరపడేనా..?

వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన బాల రక్షాభవన్ ఉద్యోగుల మధ్య సమన్వయ లోపం కారణంగా వివాదాలు తలెత్తుతున్నాయా..? లేక అధికారుల పర్యవేక్షణ లోపమా.. అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో జిల్లాలో పిల్లల దత్తత విషయంపై రాయపర్తి మండలానికి చెందిన మురుపోజు రాంబాబు- సవిత దంపతులు, వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన బొమ్మిడి నర్సయ్య దంపతులు సీనియార్టీ విషయంలో వేర్వేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీడబ్ల్యూఓ విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించినా.. కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయంలో ఓ మంత్రి ప్రమేయం ఉన్నట్లు చర్చ. ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీసీపీఓపై వచ్చిన వేధింపుల ఫిర్యాదులపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు వచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా వేచి ఉన్నారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ బాల రక్షాభవన్‌లో వివాదాలు ఎందుకు వస్తున్నాయనేది సమగ్ర విచారణ అనంతరమే తేలనుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

CHANGE OF NAME

■ I, SURENDER KUMAR JAIN (Old Name) Age:60 Years, S/o. Muralidhar Ratanlal jain late, That my wife name Renuka Devi Instead of Kala Renuka Jain, Caste OC-Jain, Occ: Business, R/o at. H.No. 3-1-157/2, Laxmi Takies Road, Dornakal, Mahabubabad District-506381, Telangana state, India. I. have changed my Name KALA SURENDER KUMAR JAIN (New name) S/o. RATANLAL JAIN & H/o. Kala Renuka Jain [W-1242441]

■ I, KALA JAIN BABITA GYANCHAND (Old Name), Age 55 years D/o. GYAN CHAND JAIN, W/o. KALA Ravinder Kumar Jain, Caste OC-Jain, Occ: House wife, R/o, at. H.No.3-1-157/3, Laxmi Takies Road Dornakal, Mahabubabad District Telangana state - 506381, India. I, have changed my Name KALA BABITA JAIN (New name), W/o KALA RAVINDER KUMAR JAIN, D/o GYANCHAND JAIN. [W-1242440]

■ I, RENUKA DEVI KALA & RENUKA JAIN KALA, (Old Name), Age:60 years W/o. Surendar Kumar, D/o Chinthar Malji Baklival, Caste: OC-Jain, Occ: House wife, R/o,at. H.No.3-1-157/2, Laxmi Takies Road, Dornakal, Mahabubabad District - 506381, Telangana state, India. I, have changed my Name KALA RENUKA JAIN (New name), W/o. KALA SURENDER KUMAR JAIN , D/o. CHITARMAL JAIN. [W-1242439]

RESTAURENT FOR SALE

■ వరంగల్ ఖమ్మం మెయిన్ రోడ్డుకి వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా గల బాలాజీ రెస్టారెంట్ ఫర్నీచర్‌తో సహా అమ్మబడును. సంప్ర॥ 7396077320, 9440761222. [W-1239827]

WANTED

■ మా ఆఫీస్‌లో పనిచేయుటకు స్త్రీలు అర్జెంటుగా కావలెను. అర్హత: 10th and above వివరాలకు వెంటనే సంప్రదించండి. సెల్: 7382323126. [W-1239829]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం:12000-15000. సెల్: 9000463426. [W-1264984]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం 18K ఫోన్: 9160900024, 9640400073 [H-796264]

■ కాకతీయ యూనివర్సిటి వరంగల్ క్యాంపస్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్సు కావలెను. అభ్యర్థులు S.S.C. Pass, ఎత్తు: 5.6, జీతం: 11,100/, 8 Hours డ్యూటీ, E.P.F., ESI ఇవ్వబడును. సంప్ర॥ 9848367179, 9848481409. [M-1167644]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


బస్సును తప్పించబోయి అనంతలోకాలకు..

- బైక్ అదుపు తప్పి ఒకరి దుర్మరణం
- గుండేడులో ఘటన


శ్రీనివాస్ (ఫైల్)

కమలాపూర్ : బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి బస్సును తప్పించబోయి అనంతలోకాలకు చేరాడు. వాహనం అదుపు తప్పి పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నెట్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లికి చెందిన బొద్దుల శ్రీనివాస్ (40) బుధవారం కంప్యూటర్ కొనుగోలు చేయడానికి తన బైక్‌పై హనుమకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుండేడు శివారులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయాడు. దీంతో బైక్ అదుపు తప్పి పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న కుటుంబీకులు, బంధువులు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

రైల్వే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ తనిఖీ


కాజీపేట రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న అడిషనల్ రైల్వే మేనేజర్ రాజీవ్‌కుమార్ గంగ్లే

కాజీపేట రూరల్ : రైలు ప్రమాదాలు సంభవించినప్పుడు కాజీపేట జంక్షన్ నుంచి యుద్ధప్రాతిపదికన వెళ్లే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, మెడికల రిలీఫ్ ట్రైన్, భారీ క్రేన్‌ను సికింద్రాబాద్ డివిజన్ అడిషనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్ విభాగం) రాజీవ్ కుమార్ గంగ్లే బుధవారం తనిఖీ చేశారు. యంత్ర పరికరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని, మందుల ఎక్స్‌పైరీ డేట్, ఇతర వస్తు సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సిబ్బంది వివరాలు, అధికారుల పనితీరు తెలుసుకున్నారు. అనంతరం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌లు, రన్నింగ్ రూం కార్యాలయం, రూట్‌రిలే ఇంటర్ లాకింగ్ సిస్టమ్ కార్యాలయంలో తనిఖీలు చేసి విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ సీనియర్ డీఎంఈ కోఆర్డినేషన్ కె.శ్రీనివాస్, సీనియర్ డీఎస్ఓ సురేశ్‌కుమార్, సీనియర్ డీఎంఈ వెంకటకుమార్, డీఎంఈ అనికేత్, బ్రేక్‌డౌన్ ఎస్ఎస్ఈ పి.చంద్రశేఖర్, రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

కళాసంపద.. కనుమరుగు!

కాకతీయుల చారిత్రక కట్టడాలపై నిలువెత్తు నిర్లక్ష్యం

- శిథిలావస్థలో వరలక్ష్మి దేవాలయం, రాతి, మట్టికోటలు
- గుప్తు నిధులు కోసం దుండగుల తవ్వకాలు
- పట్టించుకోని పురావస్తు అధికారులు


గుండు చెరువు సమీపంలో వరాలమ్మ గుడి


భూమి దిగువన కాకతీయులతో పూజలందుకున్న వరలక్ష్మి గుడి

ఖిలా వరంగల్ : పాలకుల పట్టింపులేని తనం.. అధికారుల అలసత్వం.. గుప్తనిధి వేటగాళ్ల దుశ్చర్య.. వెరసి చారిత్రక ఖిలా వరంగల్ కోటలోని విలువైన చారిత్రక శిల్ప కళా సంపద కనుమరుగవుతోంది. భావితరాలకు భద్రంగా అందించాల్సిన చారిత్రకట్ట కట్టడాలు, శిల్ప కళా సంపద పట్టింపు లేక కుంచించుకుపోతోంది. ఫలితంగా తెలుగు రాష్ట్రాలను ఏకం చేసిన కాకతీయుల ఆనవాళ్లు కూడా కాపాడుకోలేని దుస్థితి కనిపిస్తోంది. శతాబ్దాల పాటు ఓరుగల్లును పాలించిన కాకతీయుల కాలంలో మొత్తం ఏడుకోటలు ఉండేవి. ప్రస్తుతం వాటి చుట్టూ నగరం విస్తరించడంతో క్రమేనా కాలగర్భంలో కలిసిపోయాయి. నేడు కాకతీయ రాజధాని చుట్టూ రాతి, మటికోటలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా పునర్నిర్మాణం లేక శిథిలమవుతున్నాయి. కోటలను తవ్వి సమాధులు మాయం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో గుప్త నిధుల వేటగాళ్లు, ఆకతాయిల వల్ల శిల్ప కళా సంపద ధ్వంసమవుతోంది.

శిథిలావస్థలో వరాలమ్మ గుడి..

మధ్యకోట గుండు చెరువు సమీపంలో కాకతీయులతో పూజలందుకున్న వరాలమ్మ గుడి శిథిలావస్థకు చేరుకుంది. ఆలనాపాలన లేక కాలగర్భంలో కలిసిపోతోంది. ఈ గుడికి సుదీర్ఘ చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతున్నారు. అంతఃపురం నుంచి సొరంగా మార్గం ద్వారా కాకతీయ రాజులు, రాణులు వరాలమ్మ గుడికి చేరుకుని నిత్య పూజలు చేసేవారని ప్రచారంలో ఉంది. చిల్డ్రన్ పార్క్ నుంచి గుండుచెరువు అంచున వరలక్ష్మి గుడి భూమి పైభాగానే కనిపిస్తుంది. ఆ గుడికి రెండు మీటర్ల దూరంలో భూగర్భంలో అద్భుతమైన శిల్ప కళా సంపదతో కూడిన మరో వరాలమ్మ గుడి కనిపిస్తుంది. భూమికి 15ఫీట్ల దిగువన సుందర గుడి ఉంటుంది. వరాలమ్మగుడిని సందర్శించాలంటే మెట్ల మార్గం ద్వారా లోపలికి వెళ్తే విశాలమైన రెండు గదులు కనిపిస్తాయి. ప్రస్తుతం గుడిగోపురంతోపాటుపై కప్పు పూర్తిగా ధ్వంసమైంది. ఈ గుడి నేలమడిగెలో ఉండడం వల్ల బయటి ప్రపంచానికి ఎక్కువ తెలియదు. గుప్తనిధుల కోసం గుడిని ఎక్కడికక్కడే ధ్వంసం చేశారు. ప్రస్తుతం వరాలమ్మ గుడి పైకప్పు కూలిపోయి పిచ్చిమొక్కలతో కనిపిస్తోంది.

కనుమరగవుతున్న చరిత్ర ..

కాకతీయుల రాజధాని చుట్టూ మొత్తం చిన్న, పెద్ద 115 ఆలయాలు ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు. ప్రతి ఆలయం శిథిలావస్థకు చేరిందని, గర్భగుడిలో విగ్రహాల ధ్వంసమై కనిపిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. మధ్య, తూర్పు కోటకు వెళ్ల ప్రధాన రహదారిలో శివాలయం శిథిలావస్థకు చేరింది. అలాగే, బావులు కూడా శిథిలమై కనిపిస్తున్నాయి. గుప్త నిధులున్నాయనే ఆశతో దుండగులు అడుగడుగునా తవ్వకాలు జరిపారు. కోట పరిసరాల్లో ఎన్నో అద్భుత ఆలయాలున్నా పర్యాటకులు దర్శించలేని పరిస్థితి కనిపిస్తోంది. కోట గోడలు కూలిపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని పర్యాటకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చారిత్రక సంపదను కాపాడాలి



కాకతీయుల పాలనకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే చారిత్రక సంపదను కాపాడాలి. పునర్నిర్మాణం లేక రాతి, మట్టి కోటలు కనుమరుగవుతున్నాయి. కబ్జాదారుల ఆగడాలతో చెరువులు కుంచించుకుపోతున్నాయి. మట్టికోట చుట్టూ శ్మశాన వాటికలు, సమాధులే దర్శనమిస్తున్నాయి. వరాలమ్మగుడి పైకప్పు ధ్వంసమై ఏళ్ల గడుస్తున్నా పట్టింపులేదు. భూగర్భంలో ఉన్న చారిత్రక కట్టడాలను వెలికితీసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

శివాజీ, మధ్యకోట